మువ్వన్నెల పతాకం రెపరెపలు


సీతంపేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో జెండా ఎగురవేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న సీఐ సంతోష్ నాయుడు


శాంతినగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు చందు


55వ వార్డులో జెండా ఎగురవేస్తున్న గంటా కామరాజు, ఉమ్మిడి వాసుదేవరావు

- ఘనంగా గణతంత్ర వేడుకలు

సీతంపేట: గణతంత్ర వేడుకలు ఉత్తర నియోజకవర్గంలో గురువారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కార్మిక సంఘాల కార్యాలయాల్లో మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది.

● జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట జీవీఎంసీ కేఆర్‌కే ప్రైమరీ స్కూల్‌లో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మువ్వన్నెల జెండా ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులంతా ఉన్నతంగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజిని, ఉపాధ్యాయులు శారదా, అరుణకుమారి, వాసవీ క్లబ్ సభ్యులు గాయత్రి, సుభద్ర, శివాని, ధర్మారావు పాల్గొన్నారు.

● స్థానిక ఎన్జీవోస్ కాలనీలో మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మళ్ళ వెంకటరావు ఆధ్వర్యంలో సీఐ సంతోష్ నాయుడు ముఖ్యఅతిథిగా జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు బండే వెంకటేశ్వరరావు, మహిళా గౌరవాధ్యక్షురాలు మళ్ళ లక్ష్మి, లక్ష్మీనాయుడు, కోడూరు శ్రీనివాస్, పేరి అరుణ పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్‌లో నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, వైస్ ప్రెసిడెంట్ పి.వి.రమణ, కార్యదర్శి లాలం సత్యనారాయణ, అప్పలనాయుడు, రాజు, శశి, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెంలో శ్రీవేంకటేశ్వర గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు గంటా కామరాజు జెండా ఆవిష్కరణ చేశారు. పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● కంచరపాలెం ఇందిరానగర్ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి జాతీయ పతాకం ఎగురవేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. **మురళీనగర్:** జీవీఎంసీ 49వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిప్యూటీ ఫ్లోర్ లీడరు, కార్పొరేటర్ అల్లు శంకరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భట్రాజ కార్పొరేషన్ డైరెక్టరు ఎస్.రవికుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, ఎస్.చంద్రశేఖర్, కె.ఢిల్లీరావు, బి.సరస్వతి, వి.కమలకుమారి, సీహెచ్.శ్యామల పాల్గొన్నారు. వైశాఖి స్పోర్ట్సు పార్కులో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ జెండా వందనం చేశారు. వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కేజీ కృష్ణారావు, విజయానందరావు పాల్గొన్నారు. మాధవధారలోని మురళీమాధవ విద్యాలయంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ సమన్వయకర్త కేకే రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, డైరెక్టర్ సూకరాజు, రాయుడు శ్రీనివాస్, పైడి రమణ, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

వీజేఎఫ్ ఆధ్వర్యంలో..

సీతమ్మధార నార్ల వెంకటేశ్వర భవనంలో వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. ఫోర్తుటౌన్ ద్వారకా పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, బీజేపీ కార్యాలయంలో మువ్వన్నెల పతాకాన్ని ఎగుర వేశారు.


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు


49వ వార్డులో జెండా ఆవిష్కరించి ప్రసంగిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడరు అల్లు శంకరరావు


వైశాఖి స్పోర్ట్సు పార్కులో జెండా వందనంలో పాల్గొన్న సభ్యులు


వాకర్స్ పార్కులో జెండా వందనం చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కొత్త పోర్టులతో ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి


పతాకావిష్కరణ చేసిన భావనపాడు పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మూర్తి

దొండపర్తి(విశాఖ దక్షిణ): రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కొత్తగా ఏర్పాటవుతున్న పోర్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి దోహదపడతాయని భావనపాడు పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ టి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. డీసీఐఎల్ ప్రాంగణంలో ఉన్న ఏపీ మారిటైం బోర్డు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు వంటి 3 మైనర్ కొత్త పోర్టుల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 9 ఫిషింగ్ హార్బర్‌లను కూడా నిర్మిస్తోందని, వీటితో ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవన విధానం మెరుగుపడుతుందన్నారు.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో..

సీతమ్మధారలో ఉన్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐఎల్)కార్యాలయంలో సంస్థ ఎండీ అండ్ సీఈవో కెప్టెన్ ఎస్.దివాకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రగతి, సాధించాల్సిన లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఐఎల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


పతాకావిష్కరణ చేస్తున్న డీసీఐఎల్ ఎండీ అండ్ సీఈవో కెప్టెన్ ఎస్.దివాకర్

క్లుప్తంగా

కార్పొరేటర్ గంకలకు సత్కారం


కార్పొరేటర్ గంకల కవిత, అప్పారావును సత్కరిస్తున్న కాలనీ ప్రజలు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధిలో అల్లూరి సీతారామరాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ గంకల కవిత, అప్పారావు దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. వార్డులో అభివృద్ధి పనులకు జీవీఎంసీ కౌన్సిల్‌లో నిధులు మంజూరుకు కృషి చేయడం ఎంతో అభినందనీయమని వార్డు ప్రజలు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా పరదేశమ్మ అనుపు మహోత్సవం


మేయర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ ప్రాంతాలలోని పరదేశమ్మ వార్షిక అనుపు మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనుపు ఉత్సవంలో కోలాటం, బల్ల వేషాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు మేయర్‌ను సత్కరించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


ప్లాస్టిక్ నిషేధంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువతీ యువకులు

బీచ్‌రోడ్డు: ప్లాస్టిక్ నిషేధిద్దాం-పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ యువతీ యువకులు నినదించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గో బడ్డీ యాప్ ఆధ్వర్యంలో గురువారం బీచ్ రోడ్డులోని ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. గుడ్డ సంచులను వినియోగిద్దామంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా 50 వేలు ప్లాస్టిక్ నిషేధిత పోస్టర్లను జీవీఎంసీ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లాయర్లు పలక శ్రీరామమూర్తి, అహ్మద్, రాజు, గో బడ్డీ యాప్ ప్రతినిధులు శివకుమార్, నర్సింగరావు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


ప్రమాదానికి గురైన కారు

మల్కాపురం : 58వ వార్డు పిలకవానిపాలెం మలుపు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం ఓ వైపునకు ఒరిగిపోయింది. ఘటనలో మరో రెండు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. పిలకవానిపాలెం సమీపాన గల నార్త్ ఇండియన్ ఒకరు గురువారం తెల్లవారుజామున తన స్నేహితుడి కారులో ఓ శుభకార్యానికి బయలుదేరారు. పిలకవానిపాలెం మలుపు వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం పక్కన పార్కు చేసిన రెండు ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

సామాన్యునికి అర్థమయ్యేలా ఎన్నికలు జరగాలి

సీతంపేట: చదువు రాని సామాన్యుడికి సైతం అర్థమయ్యే రీతిలో ఎన్నికలు జరగాలని హైకోర్టు న్యాయవాది శ్రీకాంత్ చింతల అన్నారు. భీమ్‌సేన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'రాజ్యాంగ నైతికత, పారదర్శక ఎన్నికలు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. జర్మనీలో ఈవీఎంలను తిరస్కరించారని, ఈవీఎంలలో ట్యాంపరింగ్‌కు చాలా అవకాశం ఉందన్నారు. బటన్ నొక్కితే తన ఓటు ఎక్కడికి వెళుతుందో వేసిన వ్యక్తికి కనిపిస్తుందా? అని ప్రశ్నించారు. ముందుగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమ్‌సేన ఉపాధ్యక్షుడు వి.వి.డి.దుర్గారావు, సభాధ్యక్షుడు ఆరోగ్యనాథ్, ఎస్.ఆర్.వేమన, అధ్యక్షుడు కె.చిన్నారావు, ప్రధాన కార్యదర్శి వసంత రాజేంద్రప్రసాద్, బి.రత్నకుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది శ్రీకాంత్

లలితా పీఠంలో వసంత పంచమి వేడుకలు


ఆశీనులైన లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి


స్వామి దర్శనం కోసం దర్బారు హాల్లో నిరీక్షిస్తున్న భక్తులు

సీతంపేట: లలితా పీఠంలో వసంత పంచమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. లలితా అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గర్భాలయాన్ని పూలమాలలతో చూడముచ్చటగా తీర్చిదిద్దారు. అమ్మవారికి విశేష పూజలు, సరస్వతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి పూజలో ఉంచిన పెన్నులను శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.

స్థానిక లలితా పీఠానికి భక్తులు పోటెత్తారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి సుమారు 8 నెలల తర్వాత పీఠానికి వచ్చారు. దీంతో స్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరుతున్నారు. చాలా కాలం తర్వాత పీఠానికి విచ్చేసిన స్వామి దర్శనం కోసం భక్తులు నిరీక్షించారు. స్వామి దర్శనం, మంత్రోపదేశం కోసం వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో కుర్తాళం సీఈవో మోచర్ల శశిభూషణ్, ఆస్థాన వేద పండితులు మాచవోలు రమేష్‌శర్మ, లలితా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ పాల్గొన్నారు.

శ్రీరాములుకు 'రంగ స్థల కళాబంధు' బిరుదు



శ్రీరాములుకు బిరుదు ప్రదానం చేస్తున్న వి.వి.రమణమూర్తి, నల్లనయ్య

సీతంపేట: శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల నటుడు బడే శ్రీరాములు నాయుడుకు 'రంగ స్థల కళాబంధు' బిరుదు ప్రదానం చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య చేతుల మీదుగా ఈ బిరుదు అందజేశారు. ఈ సందర్భంగా వారణాశి సన్నివేశం నుంచి సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. బడే శ్రీరాములునాయుడు హరిశ్చంద్రునిగా, కె.వి.పద్మావతి చంద్రమతిగా, కందుల గున్నేశ్వరరావు నక్షత్రకునిగా, బగాది విజయసాయి కాలకౌశిక, టి.దాలినాయుడు వీరబాహుగా నటించి మెప్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీమాతా కళాపీఠం గౌరవ సలహాదారు వెంకన్న చౌదరి, బిన్నాల నరసింహమూర్తి, పల్లి నాగభూషణరావు, పద్మశ్రీ యడ్ల గోపాలరావు, కురిటి సత్యంనాయుడు, నంది అవార్డు గ్రహీత మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు ఏయూ సేవలు అమోఘం

ఏయూ క్యాంపస్: దేశ రక్షణ రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల ఉన్నత విద్య కలలు సాకారం చేసుకునే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయ అందిస్తున్న సహకారం అమోఘమని భారత రక్షణ మంత్రిత్వ శాఖ డీజీఆర్ విభాగం డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ శరద్‌కపూర్ అన్నారు. గురువారం ఏయూలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శరద్‌కపూర్ మాట్లాడుతూ త్రివిధ దళాలలో పనిచేసి పదవీ విరమణ చేసే ఉద్యోగులకు నూతన భవిష్యత్తును అందించే దిశగా ఏయూ కృషి చేస్తుందన్నారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణ త్రికరణ శుద్ధిగా చేపడుతూ దేశభక్తితో ముందుకు సాగాలన్నారు. అందరికీ నాణ్యమైన ఉన్నత విద్యను అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారం, తోడ్పాటును అందిస్తున్నారన్నారు. వేడుకల్లో భాగంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, త్రివిధ దళాల ఉద్యోగుల గౌరవ వందనాన్ని వీసీ ప్రసాదరెడ్డి, అతిథి శరద్‌కపూర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● ముందుగా ఉదయం మేజర్ జనరల్ శరద్‌కపూర్ ఏయూ వీసీతో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షణ రంగాల ఉద్యోగుల కోసం ఏయూ నిర్వహిస్తున్న కోర్సులు, అవగాహన ఒప్పందాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్‌స్టీఫెన్, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, డాక్టర్ ఉజ్వల్‌కుమార్ ఘటక్, తదితరులు పాల్గొన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, డీజీ శరద్‌కపూర్

'ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ తప్పనిసరి'


అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని, అటువంటి వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట అఖిల పక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు 663వ రోజుకు చేరుకున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ఉపాధి కల్పనలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తామని ప్రధాని మోదీ ప్రభుత్వం బరితెగించి ప్రకటనలు చేస్తుంటే.. బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ ఏమాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో కన్వీనర్ పి.మణి, నాయకులు పద్మ, మేరి, మంగశ్రీ, రత్నం, ముత్యాలమ్మ, సీఐటీయూ నాయకులు కుమార్ మంగళం, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరీశునికి విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవను కనులపండువగా జరిపించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళిని నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

కమనీయం.. నిత్యకల్యాణం

స్వామికి నిత్యకల్యాణం మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేప చేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గరుడసేవ

అప్పన్న స్వామికి గురువారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.


గరుడసేవను నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజ


అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు రామారావుశర్మ

సీతమ్మధార: వసంత పంచమి సందర్భంగా నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో సరస్వతిదేవికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామారావుశర్మ, వంశీ భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేశారు. వంద మంది పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. వసంత బాల స్కూల్‌లో సరస్వతి దేవికి పూజలు నిర్వహించి, పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సత్య రూపవాణి, ఎస్.సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్. సురేష్, ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.